క్లుప్తంగా

బయోడైవర్సిటీ పార్క్‌లో విద్యార్థుల సందడి



బయోడైవర్సిటీ పార్క్‌లో భీమిలి డైట్ కళాశాల విద్యార్థులు

బీచ్‌రోడ్డు: భీమిలికి చెందిన డైట్ కళాశాల విద్యార్థులు శనివారం పెదవాల్తేరులోని బయోడైవర్సిటీ పార్క్‌ను సందర్శించారు. వారికి పార్క్ పర్యవేక్షకుడు డాక్టర్ ఎం. రామమూర్తి వివిధ రకాల మొక్కల విశేషాలను తెలియజేశారు. మొక్కల శాస్త్రీయ నామాలు, ఉపయోగాలు, పెరిగే వాతావరణం గురించి వివరించారు. పార్క్‌లో విద్యార్థులంతా కలిసి సందడి చేశారు. డైట్ కాలేజీ ప్రిన్సిపాల్ జ్యోతికుమారి, వైస్ ప్రిన్సిపాల్ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

ఆరిలోవ: పైనాపిల్ కాలనీలో కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు, 11 కేవీ పైనాపిల్ కాలనీ, 11 కేవీ దుర్గానగర్, 11 కేవీ అంబేడ్కర్ నగర్ ఫీడర్ల పరిధిలో మరమ్మతుల నిమిత్తం ఈ నెల 17న విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనుందని జోన్-3 ఈఈ పోలాకి శ్రీనివాసరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈమేరకు సోమవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పైనాపిల్ కాలనీ, దారపాలెం, సీఐడీ కార్యాలయం నుంచి రామకృష్ణాపురం, ముడసర్లోవ వరకు ఆరిలోవ కాలనీ నుంచి శ్రీకాంత్‌నగర్, దుర్గాబజార్, నెహ్రూనగర్, టీబీసీ పాయింట్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించి, సహకరించాలని ఆయన కోరారు.

భర్త అదృశ్యంపై ఫిర్యాదు

ఎంవీపీకాలనీ: జాలరి ఎండాడకు చెందిన కిరణ్ అనే వ్యక్తి అదృశ్యంపై ఎంవీపీ కాలనీ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. కార్పెంటర్‌గా పనిచేస్తున్న కిరణ్ జాలరి ఎండాడలో కుటుంబంతో కలిసి నివసిస్తున్నాడు. అతడికి భార్య దేవి, ఇద్దరు కుమారులున్నారు. వేరే మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకున్న అతడు గతంలో ఆమెతో కలిసి పరారయ్యాడు. పెద్దలు మందలించడంతో భార్య, పిల్లలతో జాలరి ఎండాడలోనే కిరణ్ ఉంటున్నాడు. ఈ నెల 10న భార్య దేవి పేరుమీద ఉన్న వాహనంతోపాటు ఆమె సోదరుడి బంగారు గొలుసు, రూ.లక్ష నగదు తీసుకొని పరారయ్యాడు. అదే రోజు నుంచి కిరణ్‌తో వివాహేతర సంబంధం పెట్టుకున్న మహిళ కూడా కనిపించడం లేదు. దీంతో ఇద్దరూ కలిసి మరోసారి వెళ్లిపోయినట్లు గుర్తించిన భార్య, కుటుంబ సభ్యులు ఎంవీపీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కొట్లాటలో ఇద్దరిపై కేసు

సీతమ్మధార: పరస్పర దాడులకు పాల్పడిన ఘటనలో ఇద్దరు వ్యక్తులపై ద్వారకా పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలిలా.. రామకృష్ణ అనే వ్యక్తి ద్వారకానగర్‌లో బిర్యానీ సెంటర్ నడుపుతున్నాడు. బిర్యానీకి కావాల్సిన చికెన్‌ను హెచ్‌బీ కాలనీకి చెందిన శ్రీనివాస్ ఇస్తుండేవాడు. కొద్ది నెలలుగా లక్ష రూపాయలు శ్రీనివాస్‌కు బకాయి పడటంతో శనివారం బిర్యానీ సెంటర్ వద్దకు వెళ్లి నగదు ఇవ్వాలని నిలదీశాడు. ఇరువురి మధ్య తోపులాట జరిగి ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. రామకృష్ణ తండ్రి అప్పలనాయుడు ఫిర్యాదు మేరకు ఇద్దరిపై ద్వారకా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బీచ్ రోడ్డులో గేదెల సంచారం



బీచ్ రోడ్డులోకి గేదెలు వచ్చాయి. వాహనదారులకు ఇబ్బందులు కలిగించాయి. రోడ్డు మధ్యలో అవి నడిచి వెళ్లడంతో వాహనాలు ముందుకు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. గేదెల యజమానులు కూడా పట్టించుకోకపోవడంతో చాలాసేపు అక్కడే తిరుగుతూ కనిపించాయి.

– ఫొటో: సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

విజయీభవ



రేపటి నుంచి పదో తరగతి పరీక్షలు

సిద్ధమైన ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు

చినగదిలి మండలంలోని పరీక్ష కేంద్రాల్లో ఏర్పాట్లు

ఉత్తమ ఫలితాలే లక్ష్యంగా పఠనం





తోటగరువు జెడ్పీ హైస్కూల్ తరగతి గదిలో చదువుతున్న పదో తరగతి విద్యార్థులు

ఆరిలోవ: పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు సమయం ఆసన్నమైంది. పాఠశాలల్లో ఉపాధ్యాయులు మూడు నెలల కిందట పాఠ్యాంశాల బోధన పూర్తి చేశారు. అప్పటి నుంచి విద్యార్థులు పరీక్షలు రాసేందుకు పుస్తకాలతో కుస్తీలు పడుతున్నారు. వీటికి ఈ నెలాఖరుతో ఫుల్‌స్టాప్ పడబోతోంది. ఈ విద్యా సంవత్సరం పదో తరగతి పరీక్షలు ఈ నెల 17న ప్రారంభమై.. ఏప్రిల్ 1తో ముగియనున్నాయి. చినగదిలి మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులు పుస్తక పఠనంలో నిమగ్నమై పరీక్షలకు సిద్ధమయ్యారు. విద్యా శాఖ అధికారులు పరీక్ష కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులంతా ఉత్తమ ఫలితాలు సాధించాలని దీవిస్తూ ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ఆల్ ది బెస్ట్ చెబుతున్నారు.

మండలంలో 22 పరీక్ష కేంద్రాలు..

చినగదిలి మండలంలో విద్యా శాఖాధికారులు పదో తరగతి విద్యార్థుల కోసం 22 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. శ్రీకృష్ణాపురం నుంచి ఆరిలోవ, పీఎం పాలెం, మధురవాడ వరకు ఆయా కేంద్రాలు సిద్ధం చేశారు. వాటిలో 3,763 మంది టెన్త్ విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి చదివిన విద్యార్థులు 1,846 మంది కాగా.. వివిధ ప్రైవేట్ స్కూళ్లలో చదివిన విద్యార్థులు 1,927 మంది ఉన్నారు.

12 ప్రభుత్వ పాఠశాలలు.. 1,846 మంది విద్యార్థులు

చినగదిలి మండల పరిధిలో వేల సంఖ్యలోనే పదో తరగతి విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. మండలంలో 12 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలున్నాయి. వాటిల్లో 1,846 మంది విద్యార్థులు ఈ ఏడాది పదో తరగతి పరీక్షలు రాయడానికి సిద్ధమవుతున్నారు.



శ్రీకృష్ణాపురం గురుకులంలో పదో తరగతి విద్యార్థులు

వారిలో 984 మంది బాలురు కాగా.. 862 మంది బాలికలు ఉన్నారు. వీరితోపాటు 1,927 మంది వివిధ ప్రైవేట్ స్కూళ్లల్లో చదువుతున్న విద్యార్థులున్నారు. వారి కోసం జిల్లా విద్యా శాఖాధికారుల ఆదేశాలతో ఎంఈవోలు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఆరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు కాగా.. మరో ఐదు గురుకులాలు, ఒకటి అంధ బాలికల పాఠశాల ఉన్నాయి.

విద్యార్థుల వివరాలు ఇలా..

చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 794 మంది విద్యార్థులు ఉండగా.. వారిలో 377 మంది బాలురు, 422 మంది బాలికలు టెన్త్ పరీక్షలు రాస్తున్నారు. తోటగరువు జెడ్పీ హైస్కూల్‌లో 355 మంది విద్యార్థుల్లో 187 మంది బాలురు, 168 మంది బాలికలు, అడవివరం హైస్కూల్‌లో 87 మంది విద్యార్థుల్లో 49 మంది బాలురు, 38 మంది బాలికలు, సునీల్‌శర్మ కాలనీ హైస్కూల్‌లో 65 మందిలో 30 మంది బాలురు, 35 మంది బాలికలు, ఎండాడ హైస్కూల్‌లో 95 మందిలో 48 మంది బాలురు, 47 మంది బాలికలు, వాడపాలెం హైస్కూల్‌లో 32 మందిలో 14 మంది బాలురు, 18 మంది బాలికలు ఉన్నారు. శ్రీకృష్ణాపురం బాలుర గురుకులంలో 58 మంది, అడవివరం బాలురు గురుకులంలో 147 మంది, మారికవలస బాలురు గురుకులంలో 74 మంది, కొమ్మాది సీవోఈ బాలికల గురుకులంలో 80 మంది, రిక్షా కాలనీ సీవోఈ బాలికల గురుకులంలో 42 మందితో పాటు ఎండాడలోని అంధబాలికల పాఠశాలలో 12 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాసేందుకు సన్నద్ధమయ్యారు.

అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం

2024–25 విద్యా సంవత్సరం పదో తరగతి పబ్లిక్ పరీక్షల కోసం చినగదిలి మండలంలో ఏర్పాట్లు చేస్తున్నాం. వీటి కోసం 22 కేంద్రాలను కేటాయించాం. ప్రతి గదిలో 24 మంది విద్యార్థులు ఉండేలా బెంచీలు సిద్ధం చేస్తున్నాం. టెన్త్ పరీక్షల కోసం సుమారు 200 మంది ఇన్విజిలేటర్లను నియమించాం. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా కేంద్రాల వద్ద తాగునీటితోపాటు వైద్య సిబ్బంది అందుబాటులో ఉండేలా చర్యలు చేపడుతున్నాం.

– రవీంద్రబాబు, ఎంఈవో 1, చినగదిలి మండలం

ఇంటర్ సెకండియర్ పరీక్షలకు 18 మంది గైర్హాజరు

మద్దిలపాలెం: డాక్టర్ వి.ఎస్.కృష్ణా ప్రభుత్వ జూనియర్ కళాశాల కేంద్రంలో శనివారం జరిగిన ఇంటర్మీడియట్ సెకండియర్ పరీక్షలకు 18 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని చీఫ్ సూపరింటెండెంట్ పద్మావతి తెలిపారు. జనరల్ విద్యార్థులు 247 మంది హాజరు కావాల్సి ఉండగా.. ఐదుగురు రాలేదన్నారు. ఒకేషనల్ కోర్సు విద్యార్థులు 238 మంది కిగాను 13 మంది గైర్హాజరయ్యారు కాగా.. 225 మంది పరీక్ష రాశారని చెప్పారు. పరీక్ష రాసేందుకు 485 మంది విద్యార్థులు రావాల్సి ఉండగా.. 467 మంది పరీక్ష రాశారని, 18 మంది గైర్హాజరయ్యారన్నారు.

ముగిసిన కేంద్ర బృందం పర్యటన



డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావుతో భేటీ అయిన కేంద్ర బృందం

మహారాణిపేట: జాతీయ ఆరోగ్య కార్యక్రమాలపై క్షేత్రస్థాయిలో సర్వే శనివారంతో ముగిసింది. ఈ నెల 10 నుంచి కేంద్ర పాపులేషన్ రీసెర్చ్ సెంటర్‌కు చెందిన కేంద్ర బృంద ప్రతినిధులు డాక్టర్ రమణ, డాక్టర్ పాదాలు నాయకత్వంలో జిల్లాలోని పట్టణ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను పరిశీలించారు. ముగింపు కార్యక్రమంలో భాగంగా రేసపువానిపాలెంలోని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావుతో బృందం భేటీ అయింది. కేజీహెచ్, ప్రభుత్వ విక్టోరియా ఆస్పత్రులపై కొన్ని సూచనలు చేసింది. వైద్య ఆరోగ్య శాఖకు చెందిన వివిధ విభాగాల అధికారులు డాక్టర్ బి.ఉమావతి, శాంతిప్రియ, శ్రీనివాస్, జిల్లా క్షయ నివారణ అధికారి డాక్టర్ పూర్ణేంద్ర బాబు, జిల్లా సమన్వయకర్త డాక్టర్ హారిక, జిల్లా ప్రోగ్రాం అధికారులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పశుపక్ష్యాదుల భద్రత.. విద్యార్థుల బాధ్యత



పక్షులకు తాగునీరు ఇద్దామంటూ ప్లకార్డులు, మట్టి పాత్రలు ప్రదర్శిస్తున్న విద్యార్థులు

మద్దిలపాలెం: ఎకో వైజాగ్, స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలను జయప్రదం చేయాలని గ్రీన్ క్లైమేట్ టీం ఎన్‌జీవో వ్యవస్థాపక కార్యదర్శి జె.వి.రత్నం పిలుపునిచ్చారు. మద్దిలపాలెంలోని ఓ ప్రైవేట్ స్కూల్‌లో శనివారం పశుపక్ష్యాదులకు నీరు అందుబాటులో ఉంచడంపై అవగాహన కల్పించారు. విద్యార్థులతో నీటి కుండీలు ఏర్పాటు చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ వేసవిలో పశుపక్ష్యాదులకు తాగునీరు అందుబాటులో ఉంచాలని కోరారు. విద్యార్థులందరూ తమ బాధ్యతగా నీరు రోజూ ఏర్పాటు చేయాలన్నారు. వేసవిలో తినే దేశీయ పండ్ల గింజలు ఆరబెట్టాలని, వేసవి తర్వాత వాటిని కొండల మీద, తీర ప్రాంతంలో వేసి సామాజిక వనాలు పెంచాలని సూచించారు. వంటింటి వ్యర్థాలను ఎరువుగా తయారు చేసి తమ ఇంటి వద్ద కూరగాయలు, ఆకుకూరలు పండించుకోవాలన్నారు. ఏయూ సోషల్ వర్క్ విద్యార్థిని కేదాశ్రీ మాట్లాడుతూ పశుపక్ష్యాదుల కోసం తాగునీరు అందించేందుకు మట్టి పాత్రలను గ్రీన్ క్లైమేట్ టీం ఏర్పాటు చేయడం ఆనందదాయకమన్నారు. చాలా రోజులుగా నిర్వహిస్తున్న అవగాహన కార్యక్రమాల వల్ల ప్రజల్లో చైతన్యం వచ్చిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో స్కూల్ ఉపాధ్యాయులు, గ్రీన్ వలంటీర్లు జె.రాజేశ్వరి, ఐ.కృష్ణకుమారి పాల్గొన్నారు.

వినియోగదారుల హక్కులపై అవగాహన అవసరం

మద్దిలపాలెం: వినియోగదారుల హక్కులపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని కాలుష్య నియంత్రణ మండలి పర్యావరణ ఇంజినీర్ శ్రీనివాసరావు అన్నారు. డాక్టర్ వి.ఎస్.కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాల కన్స్యూమర్ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవం సయుక్తంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ ఐ.విజయబాబు అధ్యక్షత జరిగిన ఈ కార్యక్రమంలో శ్రీనివాసరావు మాట్లాడుతూ కొనే ప్రతి వస్తువులోనూ లోపం లేకుండా సరైన ధర తూకం కలిగినవి పొందే హక్కు వినియోగదారులకు ఉందన్నారు. కాలుష్య నియంత్రణ, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిర్మూలన గురించి వివరించారు. గౌరవ అతిథి అంబేడ్కర్ లా కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సీతామాణిక్యం మాట్లాడుతూ వినియోగదారుల హక్కులు, స్థిరమైన జీవనశైలి ఎలా పెంపొందించుకోవాలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. వినియోగదారుల రక్షణ మండలి సెక్రటరీ లింగేశ్వరరావు మాట్లాడుతూ వినియోగదారుల అవగాహన, రక్షణ మండలి పాత్ర గురించి తెలియజేశారు. వినియోగదారుల రక్షణ మండలి ఉపాధ్యక్షుడు వెంకటేశ్వర మాట్లాడుతూ మండలి ద్వారా చాలా కేసులు పరిష్కారమయ్యాయన్నారు. వాణిజ్య విభాగాధిపతి జి.రాజ్‌కుమార్ మాట్లాడుతూ ఆన్‌లైన్ షాపింగ్ ద్వారా జరిగే మోసాలను ఎలా నియంత్రించాలో విద్యార్థులకు వివరించారు. ఎలక్యూషన్, వ్యాసరచన పోటీల్లో గెలుపు పొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. కార్యక్రమంలో వినయోగదారుల క్లబ్ కో ఆర్డినేటర్ డాక్టర్ డి.మురళీధర్, డాక్టర్ కె.రవిబాబు, వాణిజ్య విభాగ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పర్యావరణ ఇంజినీర్ శ్రీనివాసరావు

వైభవంగా గౌరీ పూర్ణిమ వేడుకలు



పంచామృత, పుష్పాభిషేకాలు నిర్వహిస్తున్న హరేకృష్ణ మూవ్‌మెంట్ సభ్యులు



వేడుకల్లో పాల్గొన్న నగర భక్తులు

ఎంవీపీకాలనీ: హరేకృష్ణ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో శ్రీకృష్ణ చైతన్య మహాప్రభువు జయంతిని పురస్కరించుకొని శనివారం ఎంవీపీ కాలనీ ఏఎస్ రాజా మైదానంలో గౌరీ పూర్ణిమ వేడుకలు ఘనంగా నిర్వహించారు. సాయంత్రం 6 నుంచి రాత్రి 9 గంటల వరకు వివిధ కార్యక్రమాలు చేపట్టారు. శ్రీ నితాయ్ గౌరంగ విగ్రహాలకు(శ్రీకృష్ణ, బలరాముల విగ్రహాలకు) పంచామృతాభిషేకం, పంచగంధ్య, సువాసనలతో కూడిన పుష్పాలు, వివిధ రకాల పండ్లరసాలతో అభిషేకం చేశారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని ఆనంద పారవశ్యం పొందారు. గౌరీలీల సాంస్కృతిక నాటక ప్రదర్శన ద్వారా ఆంధ్ర విశ్వవిద్యాలయం విద్యార్థులు శ్రీ చైతన్య మహాప్రభు జీవిత లీలలను ఆవిష్కరించి ఆకట్టుకున్నారు. అనంతరం మహా మంగళ హారతి, సంకీర్తన, పల్లకీ ఉత్సవం, పూలతో హోలీ కార్యక్రమాలు అత్యంత వైభవంగా జరిగాయి. కార్యక్రమంలో హరేకృష్ణ మూవ్‌మెంట్ అధ్యక్షుడు నిష్కించిన భక్తదాస తదితరులు పాల్గొన్నారు.

లారీ ఢీకొని కారు బోల్తా

కారులోని మహిళకు తీవ్ర గాయాలు

ఎంవీపీకాలనీ: ఎంవీపీ కాలనీ పోలీస్ స్టేషన్ పరిధిలోని వెంకోజీపాలెం జాతీయ రహదారిపై శనివారం లారీ ఢీకొట్టడంతో ఓ కారు బోల్తా పడింది. ఈ ప్రమాదంలో కారులోని మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. ఎంవీపీ ఎస్ఐ ధనుంజయ్‌నాయుడు తెలిపిన వివరాలిలా.. ఎండాడకు చెందిన కాకర్ల రామకృష్ణరావు తన కియా సెల్టాస్ కార్‌లో భార్య సునీత, మరో మహిళ లక్ష్మితో కలిసి అక్కయపాలెం వెళ్తున్నారు. జాతీయ రహదారిపై హనుమంతవాక దాటిన తరువాత వెంకోజీపాలెం సిగ్నల్ పాయింట్ చేరుకునే సమయంలో వెనుక నుంచి ఓ లారీ బలంగా ఢీకొట్టడంతో ప్రమాదానికి గురయ్యారు. లారీ డ్రైవర్ అతివేగంగా, బాధ్యతారహితంగా వచ్చి ఢీనడంతో కారు బోల్తా కొట్టి రోడ్డుపై పడింది. రామకృష్ణరావుతోపాటు సునీతకు స్వల్ప గాయాలు కాగా.. లక్ష్మికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే పక్కనే ఉన్న మెడికవర్ ఆస్పత్రికి ఆమెను తరలించారు. ఎంవీపీ పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. రామకృష్ణరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ధనుంజయ్ నాయుడు తెలిపారు.



వెంకోజీపాలెం హైవేపై బోల్తా పడిన కారు

అందరి కృషితో స్వచ్ఛ విశాఖి

ప్లాస్టిక్‌ను విడనాడాలని వక్తల పిలుపు



విమ్స్ ఆవరణ శుభ్రం చేస్తున్న వైద్యాధికారులు, సిబ్బంది



జూ పార్కులో స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, సిబ్బంది



ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కల్పిస్తున్న కార్పొరేటర్ మువ్వల లక్ష్మి



ఎంవీపీ రైతుబజార్‌లో రైతులు, వినియోగదారులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న అధికారులు



కృష్ణా డిగ్రీ కళాశాలలో ప్రతిజ్ఞ చేస్తున్న ప్రిన్సిపాల్ విజయబాబు తదితరులు



వీఎంఆర్‌డీఏ పార్క్‌లో ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, విద్యార్థులు



కార్యాలయ ఆవరణను చీపురుతో శుభ్రం చేస్తున్న డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు

ఆరిలోవ: స్వర్ణ ఆంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. స్వచ్ఛ విశాఖకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వక్తలు పిలుపునిచ్చి ప్రతిజ్ఞ చేయించారు. విశాఖ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (విమ్స్)లో డైరెక్టర్ డాక్టర్ కె.రాంబాబు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వైద్యాధికారులు, నర్సింగ్ సిబ్బంది, శానిటరీ సిబ్బంది పాల్గొన్నారు. విమ్స్ ఆవరణలో చెత్త, ప్లాస్టిక్ కవర్లను సేకరించి శుభ్రం చేశారు. వాటిని జీవీఎంసీ పారిశుధ్య కార్మికులకు అప్పగించారు. సిబ్బందితో కలిసి వైద్యాధికారులంతా ప్రతిజ్ఞ చేశారు. డైరెక్టర్ రాంబాబు మాట్లాడుతూ ప్లాస్టిక్ వినియోగాన్ని అందరూ కలిసికట్టుగా నిషేధించాలన్నారు. డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాస్, ఏవో బాజిత్ తదితరులు పాల్గొన్నారు.

➡ 13వ వార్డులో శానిటరీ విభాగం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథి కార్పొరేటర్ కెల్ల సునీత స్థానికులు, పారిశుధ్య సిబ్బందితో కలిసి వీధుల్లో చెత్త తొలగించి శుభ్రం చేశారు. అనంతరం అంతా కలిసి ప్రతిజ్ఞ చేశారు. వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ రామారావు, వైఎస్సార్‌సీపీ, కూటమి నాయకులు పాల్గొన్నారు.

జూ పార్కులో..

ఇందిరాగాంధీ జూలాజికల్ పార్కులో క్యూరేటర్ జి.మంగమ్మ, సూపరింటెండెంట్ ఉమాదేవి, అసిస్టెంట్ క్యూరేటర్లు, ఎఫ్ఎస్‌వోలు, సిబ్బంది జూ లోపల ఆవరణం శుభ్రం చేశారు. సందర్శకుల ద్వారా లోపల చేరే ప్లాస్టిక్ సంచులు, చెత్త తొలగించారు. అనంతరం అందరూ ప్రతిజ్ఞ చేశారు.

కృష్ణా డిగ్రీ కళాశాలలో..

మద్దిలపాలెం: సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని విడనాడాలని డాక్టర్ వి.ఎస్.కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.విజయబాబు పిలుపునిచ్చారు. ప్లాస్టిక్ రహిత విశాఖ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులతో స్వర్ణాంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాసిక్ వ్యర్థాలు భూమిలో కలవడానికి కనీసం 500 ఏళ్ల పడతాయని, వర్షాలు పడితే నీటితో కలిసి గెడ్డలు, కాలువల ద్వారా సముద్రంలో చేరుతున్నాయన్నారు. దీనివల్ల పర్యావరణం, సముద్ర జలాలు కలుషితమవుతున్నందున సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను నిర్మూలించాలని కోరారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.జయ, డాక్టర్ కె.రవిబాబు, ఎన్ఎస్ఎస్ జోనల్ ఆఫీసర్ డాక్టర్ పి.ఉమామహేశ్వరరావు, డాక్టర్ బి.లక్ష్మి, డాక్టర్ బి.నాగేశ్వరరావు, హరికృష్ణ యూకో క్లబ్ కో ఆర్డినేటర్ డాక్టర్ వి.పద్మజ , ఇన్‌క్లూజివ్ సెల్ కో ఆర్డినేటర్ డాక్టర్ జి.లక్ష్మణరావు, ఉన్నత భారత అభియాన్ కో ఆర్డినేటర్ డాక్టర్ ఎస్.వి.రామారావు, అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

ఎంవీపీ రైతుబజార్‌లో..

ఎంవీపీకాలనీ: ఎంవీపీ కాలనీ రైతుబజార్‌లో వినియోగదారులు, రైతులతో జీవీఎంసీ అధికారులు ప్రతిజ్ఞ చేయించారు. రైతుబజార్ పరిసరాలను ఎల్లప్పుడూ శుభ్రంగా ఉంచుకోవాలని, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలని సూచించారు. రైతుబజార్ ఈవో వరహాలు, రైతులు బజార్ పరిసరాలను శుభ్రపరిచారు. కార్పొరేటర్ మంగవేణి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సూరిబాబు, సచివాలయ కార్యదర్శులు, పారిశుధ్య సిబ్బంది, రైతుబజార్ సిబ్బంది పాల్గొన్నారు.

వీఎంఆర్‌డీఏ పార్క్‌లో..

ఏయూ క్యాంపస్: బీచ్ రోడ్డులోని వీఎంఆర్‌డీఏ పార్క్‌లో చైర్మన్ ఎం.వి.ప్రణవ్ గోపాల్, కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్‌లు గాయత్రి విద్యా పరిషత్ పాఠశాల విద్యార్థులతో కలిసి పరిసరాలను శుభ్రం చేశారు. ఎంజీఎం లాన్‌లో ఉన్న చెత్తను తొలగించారు. చైర్మన్ ప్రణవ్ గోపాల్ మాట్లాడుతూ స్వచ్ఛ ఆంధ్ర, ప్లాస్టిక్ నియంత్రణలో ప్రతి వ్యక్తి భాగం కావాలన్నారు. కమిషనర్ విశ్వనాథన్ విద్యార్థులు, సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతతో నడచుకోవాలని చెప్పారు. జాయింట్ కమిషనర్ రమేష్, కార్పొరేటర్ తెడ్డు నూకరత్నం, కార్యదర్శి మురళీకృష్ణ, ప్రధాన ఇంజినీర్ వినయ్‌కుమార్, కార్యనిర్వాహక ఇంజినీర్ భవానీశంకర్, ముఖ్య గణాంక అధికారి హరిప్రసాద్, డీఎఫ్‌వో శివాని తదితరులు పాల్గొన్నారు.

20వ వార్డులో..

బీచ్‌రోడ్డు: జీవీఎంసీ 20వ వార్డులో కార్పొరేటర్ మువ్వల లక్ష్మి ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కల్పించారు. దుకాణాలు, షాపుల నిర్వాహకులకు, స్థానికులకు క్లాత్ సంచులు వినియోగించాలని సూచించారు. పారిశుధ్య సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

డీఎంహెచ్‌వో కార్యాలయంలో..

మహారాణిపేట: రేసపువానిపాలెంలోని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో పరిసరాల పరిశుభ్రత కార్యక్రమం చేపట్టారు. డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు, జిల్లా మీడియా విస్తరణ అధికారి(డీమో) ఎం.నాగేశ్వరరావు చీపుర్లతో ఆవరణను శుభ్రం చేశారు. డీఎంహెచ్‌వో మాట్లాడుతూ ప్రతి నెలా మూడో శనివారం పరిసరాల పరిశుభ్రత కోసం కొంత సమయం కేటాయించాలన్నారు. కార్యాలయంలో టేబుళ్లు, కంప్యూటర్లు, రికార్డులు, కిటికీలు, టాయిలెట్లు, టెరస్‌లను శుభ్రపరిచారు. టెర్రస్, ఆఫీస్ గోడలపైన పెరిగిన మొక్కలను తొలగించారు. ప్రోగ్రాం అధికారులు, వైద్య ఆరోగ్య సిబ్బంది, కార్యాలయ సిబ్బంది తమ సెక్షన్లతోపాటు పరిసరాలను శుభ్రం చేశారు.

సెంట్రల్ జైల్‌ను సందర్శించిన లా విద్యార్థులు



లా విద్యార్థులకు కారాగారంపై అవగాహన కల్పిస్తున్న జైల్ అధికారులు

ఆరిలోవ: విశాఖ కేంద్ర కారాగారాన్ని శనివారం నగరంలోని ఎన్‌బీఎం లా కళాశాలకు చెందిన 48 మంది ఆఖరి సంవత్సరం విద్యార్థులు సందర్శించారు. అధికారుల అనుమతితో జైల్ లోపల ఖైదీల బేరక్‌లు, పరిశ్రమలు, వారి సౌకర్యాలను విద్యార్థులు పరిశీలించారు. ఈ సందర్భంగా జైల్ సమావేశ మందిరంలో లా విద్యార్థులకు జైల్ సూపరింటెండెంట్ ఎం.మహేష్‌బాబు కారాగారంపై అవగాహన కల్పించారు. ఖైదీలకు ఏర్పాటు చేయాల్సిన సౌకర్యాలు, వారి హక్కులు, సిబ్బంది పనితీరు తదితర వాటి గురించి వివరించారు. కార్యక్రమంలో జైల్ డిప్యూటీ సూపరింటెండెంట్లు సాయిప్రవీణ్, సూర్యకుమార్, జైలర్లు పాల్గొన్నారు.

ఫొటో స్టోరీ



జాతీయ సైన్స్ డే వేడుకల్లో భాగంగా శనివారం ఆంధ్రా యూనివర్సిటీలో నిర్వహించిన ర్యాలీలో విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. సైన్స్‌పై అవగాహన కల్పిస్తూ ప్లకార్డులు ప్రదర్శించారు.

– ఫొటో: సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం